# అభిమానం

— టి. వెంకటపతి రాజు

లంకంత ఇల్లూ, సముద్రమంత సంపదా వున్న సంసారాన్ని, లేకలేక పుట్టిన పసికందునూ తనపైన విడిచి భార్య దాటుకొనిపోయినప్పట్నుంచీ వైరాగ్యంలో పడిపోయిన సీతారామయ్య తిరిగి రాగంలో పడిపోయాడంటే, ఊరి జనం నమ్మలేక పోయారు.

సీతారామయ్యదేం చిన్న సంసారం కాదు. యాభై ఎకరాల మాగాణీ, ముప్పయ్యెకరాల మెట్టా వుండి, అయిదరకల్లోనూ, ఆవులూ, గేదెల మందలతోనూ సమ్మర్దంగా వుంటుంది. విశాలమైన వాముల దొడ్లోనూ, పశువుల కొట్టాలలోనూ తిరుగుతూ పది మంది పాలేర్లు నిత్యం పనుల్లో సతమతమవుతుంటారు.

ఇంత సంపదా వుండీ ఇంటి ఇల్లాలు పోవడంతో సీతారామయ్య సీత లేని రాముడే అయ్యాడు. మళ్ళీ మనువాడమనీ, ఒక్కగా నొక్క వారసుని కోసమైనా ఈ నిర్ణయం తీసుకోమనీ అభిమానులూ, బంధువులూ ఆయన్ను ప్రాధేయపడినా.. ససేమిరా అన్న వాడు ఇప్పుడిలా చేస్తాడా అనుకొన్నారు. కానీ అందరి కళ్ళముందూ మాణిక్యం కనిపిస్తూనే వుంటే, ఇంట్లో అధికారికంగా అజమాయిషీ చేస్తోవుంటే, సీతారామయ్య కొడుకును తన గర్భశుక్తిముక్తాఫలంలా అక్కున చేర్చి మక్కువతో మోస్తూ వుంటే.. కాదను కోవడమెలాగ? మొదట ఆలు పోయిన వెలితిని వెలయాలైన మాణిక్యంతో తీర్చుకోవాలని చూసిన సీతారామయ్య ఆ తర్వాత మాణిక్యంలో యేం చూశాడో మరి, తెగించి ఇంట్లోకే చేయి పట్టి తెచ్చాడు.

వేశ్యను తెచ్చుకున్నాడన్న కోపంతో కులస్తులు ఆయన్ను వెలివేశారు. ఆ వెలి ఆయనకు తెచ్చిన వెలితేమీ లేదు. మాణిక్యం అజమాయిషీలో సంసారం అంతకంతకూ పెరుగుతోంది. పంటలు విరగబండాయి. సర్వ కార్యక్రమాలలోనూ 'మాణిక్య ప్రభ'లు వెలిగాయి. కొడుకు అశోక్ మాణిక్యంను విడిచి నిమిషం వుండలేకపోయే వాడు. వాడికి మాణిక్యమే అమ్మ. "వెలయాలు ఆలు కాదు" అనుకొన్నవాళ్ళు మాణిక్యం సీతారామయ్యకు 'ఆలు' తీర్చే అవసరాలను తీర్చడమేకాక, ఆయన కొడుక్కు 'అమ్మ' లేనిలోటు తీర్చడం చూసి ఆశ్చర్యపోయారు.

వాళ్ళు అలా ఆశ్చర్యపోతుండగానే కాలం గిర్రున తిరిగిపోయింది. అశోక్ నూనూగు మీసాల యువకుడయ్యాడు. సీతారామయ్య వృద్ధుడయ్యాడు. దాంతోపాటు ఆయనకు ఉబ్బసం వచ్చింది. "అబ్బాయి పెద్దవాడయ్యాడు, పెళ్ళిచేస్తే బావుంటుంది.



"మనమా ఎప్పుడు పోతామో చెప్పలేము" అని మాణిక్యం సలహా చెప్పినప్పుడు 'అలాగే' నన్నట్టు సీతారామయ్య తలాడించాడేగానీ, ఆయన తలలో ఎన్నడూ లేని ఆలోచన తలెత్తింది. 'అబ్బాయి పెళ్ళి సంగతి' మాణిక్యం ప్రస్తావిస్తూనే తన వారసునికి ఆమె తల్లికాదనీ, తనకు యోగ్యతలేని స్థానానికి ఎగ్రబాకాలని చూస్తున్నదనీ... లోపల కోపమొచ్చింది. అభిజాత్యం ఉబ్బసం కన్నా భయంకరంగా ఉబికింది.

అదుగో... ఆ ఆలోచన మొలకెత్తుతూనే క్షణాల మీద పెరిగి పెనుమానై పోయి... విషపు గాలులను వీచడం మొదలు పెట్టింది. కోర్కెల వేడిలో వున్నప్పుడు తనను వల్లబరచిన మాణిక్యం, వల్లబడిన వయస్సులో వున్నప్పుడు కోపపు వేడిని తెప్పిస్తోంది. మాణిక్యం దగ్గరికొస్తే విసుక్కుంటున్నాడు. జీతగాళ్ళను తన అవసరాలను చూడమని శాసిస్తున్నాడు. ఈ మార్పు వ్యాధి లక్షణమనుకొంది మాణిక్యం. కానీ, అది ఏ వ్యాధి లక్షణమో ఆ అమాయకురాలు ఊహించలేకపోయింది. అయితే, ఆమె ఊహించనవసరం లేకుండానే ఆ వ్యాధి బయటపడింది కూడా!

మాణిక్యాన్ని తెచ్చుకొన్నందుకు ఒకప్పుడు సీతారామయ్యను వెలివేసినవాళ్ళే ఆమె జీవనాధారానికి కొంత భూమిని రాసివ్వమని సూచించడం మానవతకొక ముఖమైతే, అందుకు సీతారామయ్య 'ససేమిరా' అనడం దాని రెండో ముఖం! "ఎందు కివ్వాలి? ఆమెకు ఇన్నాళ్ళుగా కల్పించిన గౌరవం చాలదా? ఆమెను నేను భార్యలాగా చూశానేగానీ భార్యగా కాదు. నేను దగ్గరికి చేర్చకపోతే, ఇంతకాలంగా ఆమె ఇటువంటి గౌరవం పొందేదా? ఈ సంబంధం ఇంతటితో పోనీకుండా నా వారసునిక్కూడా వుంచాలా?" అనేది సీతారామయ్య వాదన. ఆ సలహా ఇచ్చినవాళ్ళు 'పెద్దమనిషి' అనుకొన్న సీతారామయ్యలోని 'చిన్నమనిషి'ని చూసి ఆశ్చర్యపడ్డారు. అసహ్యించుకొన్నారు. అప్పుడు ఎందరు అసహ్యించుకొన్నా మాణిక్యాన్ని తెచ్చి ఇంట్లో పెట్టుకొన్న సీతారామయ్య, ఇప్పుడు ఎందరు అసహ్యించుకొన్నా ఆమె మీద సానుభూతి చూపలేదు.

సీతారామయ్య అంటున్న మాటలు మాణిక్యం చెవులారా విన్నా విననట్టుండిపోయింది. ఎటువంటి మార్పు, విచారం లేకుండా సీతారామయ్య ఆరోగ్యాన్ని కనిపెట్టుకు వుండడంలోనే మునిగిపోయింది. మాణిక్యం మళ్ళీ మరోసారి ఊరివాళ్ళను ఆశ్చర్యపరచింది. ఆమె మరీ అంత మంచిదని అనుకోవడానికి ఆట్టే ఇష్టంలేనివాళ్ళు పిచ్చిదనుకున్నారు. అశోక్ పెళ్ళి సంగతిని గురించి సీతారామయ్య దగ్గర మరెప్పుడూ ఎత్తలేదు మాణిక్యం. ఆ సంగతి తన దగ్గర మాట్లాడ్డం కూడా ఆయన కిష్టం లేదన్న సంగతి స్పష్టంగా అర్థం చేసుకొంది. అంతే కాదు, మాణిక్యంతో చెప్పకుండా కూడా ఆయన కొడుక్కు సంబంధాలు విచారించడమూ తెలుసుకొంది. అబ్బాయి తండ్రి వేశ్యను తెచ్చిపెట్టుకున్న సంగతి ఆటువేపు వాళ్ళకు తెలియనీకూడదన్న ఆయన ఆలోచనా అర్థమయింది ఆమెకు.

సీతారామయ్య ఇంత జాగ్రత్తపడినా మృత్యువు దగ్గర కుదర్లేదు. కొడుక్కు పెళ్ళి చేయందే వెళ్ళిపోవలసి వచ్చింది. సీతారామయ్య కర్మ అయిపోయిన మరుసటి రోజే మాణిక్యం పయనమయింది. అశోక్‌కు అంతా అయోమయమయింది. "నువ్వెళ్ళడమేమిటి? ఎందుకు? ఎక్కడికి?" అని ఆక్రోశించాడు. "నిన్ను మా అమ్మ అనే అనుకుంటున్నాను గదా" అని వాపోయాడు. "వెళ్ళొద్దమ్మా, నన్ను విడిచి వెళ్ళొద్దు. దిక్కులేనివాణ్ణి చేయొద్దు" అని ప్రాధేయపడ్డాడు. మాణిక్యం కూడా ఏడ్చింది. కళ్ళు తుడుచుకొని కాలు ముందుకు కదిపింది. అశోక్ అడ్డుపడ్డాడు.

అశోక్‌ను మాణిక్యం ఒళ్ళోకి తీసుకొంది. "బాబూ! అశోక్, మీ నాన్నకు భార్య లేని లోటు తీర్చాను. అటువంటి అనుభవం నాకు అంతకు ముందు అలవాటయిందే. అయినా మీ నాన్నకు అందువల్ల కొంతకాలం సుఖాన్నీ, తృప్తినీ ఇచ్చాను. ఆయన నన్నెన్నడూ భార్యగా భావించలేదని నాకు తెలుసు. అయినా నా కెన్నడూ కష్టమనీ, అవమానకరమనీ అనిపించలేదు. అయితే, మనిద్దరి సంగతీ వేరు. నువ్వు నన్ను అమ్మ అనే అనుకున్నావు. నేను నిన్ను కొడుకుగానే భావించాను. కానీ నీకు పెళ్ళయితే వాళ్ళు మనల్ని అలా అనుకోరు. మీ నాన్నే ఆ సంగతి నాకు గుర్తుచేశాడు. మీ నాన్నకు భార్య కాని భార్యగా గడిపాను కానీ, నీకు తల్లి కాని తల్లిలా వుండలేను..." ఆమె గొంతు వణికింది.

"అయితే నేను పెళ్ళే చేసుకోను" అని బిగ్గరగా అరిచాడు అశోక్.

"తప్పు, అలా అయితే నా ఇన్నాళ్ళ శ్రమా వృథా అయినట్టే. నీకు జీవితం లేకుండా చేయడానికా నేనుండడం? నేను నీ దగ్గరే వుండిపోతే నీ మనసులో అమ్మగా నేను కరిగిపోక తప్పదు. అది నేను భరించలేను. నన్ను పోనీ..."


"అమ్మా..." అన్నాడు ఏడుస్తూ అశోక్.

మాణిక్యం నవ్వింది.

"ఇరవై ఏండ్ల కిందట నేను మీ నాన్నతో కలసి వచ్చినప్పుడు ఇలాగే పిలిచావు. ఈ పిలుపు వింటూవుండాలనే నేను వెళ్ళిపోతున్నది..."

◆

(ఈ వాస్తవ సంఘటనను నాకు తెలియజేసిన శ్రీ పోలవరపు సూర్యప్రకాశరావుకు కృతజ్ఞత)



# ఊడ్పులు

దూర దిగంత వీధుల్లోంచి, కొండల ఎగుడు దిగుళ్ళ మీంచి
తొలి స్తన్య ధారల్ని కురిపిస్తూ మేఘ ధేనువులు కదలి వస్తున్నాయి
పసి కాళ్ళతో లేగ దూడలు ఎగసి పడుతున్నాయి
అగ్ని వాయువులు వీచిన మహా గ్రీష్మాలు, ఆ ఎండలేవి?
నింగి ఆ కొస నుండి ఈ కొసదాకా నీలి మేల్ముసుగుతో
నిలిచి చూస్తున్న ఈ కన్య ఎవరు?
ఒంగి బారులుతీరి తదేక దీక్షతో ఈ స్త్రీలు తమ చేతుల్తో రచిస్తున్నదేమిటి?
ముద్దలుగా కరుగుతున్న మట్టిలో మంత్రాక్షర పంక్తులు

కురిపించు నీ కండల స్వేదాన్ని
చాళ్ళు తీసినవి నాగలి క్రొరులు
అమృత ధారల్లో కరిగిపోతున్న విరాట్ క్షేత్రాన్ని
గునపాలు, పారలు, మట్టి తట్టలు, వొందలు వేలు చేతులు
వేళ్ళ సందుల్లోంచి చల్లుతున్నవి బంగారు విత్తనాలు

ఈ భూమి ఎవరిది?
గింజల్ని విత్తి ధాన్యాలుగా పండిస్తున్నది ఎవరికి?
దస్తావేజులు, భూమి హక్కులు, రెవెన్యూ కోర్టులు, అప్పులు - ఏవీ గుర్తులేవు ఇప్పుడు
ఉన్నవి సన్నగా ఒణికించే చిరుజల్లులు, వూరకనే తూగాడే గడ్డిపోచలు
ఈ లేత కంకుల్లో పాలు పొంగినప్పుడు కదా
ట్రాక్టర్లు, మార్కెట్ యార్డులు, దళారీలు, గిడ్డంగులు గుర్తుకొచ్చేది.
ప్రశ్నలు లేవు ఇప్పుడు. భయాలు లేవు బాధలు లేవు
ఈ రోజంతా ఆనంద మధురమయిన శ్రమ
రాత్రికి విశ్రాంతి

శ్రమిస్తున్న స్త్రీల పాదాలు మట్టిని చిలికి వెన్న తీస్తున్నాయి
బురదలో మెత్తగా దిగబడే ఆ అడుగుల్లో అడుగుల్ని కలుపు
నేల నిన్ను నీటి వలతో బంధిస్తుంది

ఐక్యం కోసం, ప్రేమ కోసం, ఆదరణ కోసం
ఎవరి చేతులూ ఖాళీగా వుండవు
అందరితో పాటు ఆశల్ని నాటు
ప్రేమ జలజలమని కురుస్తుంది
ఆదరణ గలగల ప్రవహిస్తుంది
మట్టి మధురాతి మధుర ఫలంగా వికసించి మనుషుల్ని ఒక్కటే చేస్తుంది

- వాడ్రేవు చినవీరభద్రుడు